# నేహాల



సాయిబ్రహ్మానందం గొర్తి

# చరిత్రకి బలైన స్వేచ్ఛ కథ

(గత సంచిక నుంచీ తరువాయి)

## 10

**ఆనాడు సాయంత్రం చేయాల్సిన పనులన్నీ వాయిదా వేసుకున్నాడు అహ్మద్‌ఖాన్.** హసన్‌ఖాన్ సంగతి ఉపేక్షిస్తే తన మెడకే చుట్టుకోగలదన్న సంగతి అర్థమయ్యింది. గుర్రపు బగ్గీ సిద్ధం కాగానే గిసుదరాజ్ నివాసానికి బయల్దేరాడు. తనంతట తను ఫిరోజ్‌ఖాన్‌కి చెబితే పట్టించుకోడు. పైగా అనుమానిస్తాడు కూడా. అహ్మద్‌ఖాన్‌కి రాజకీయం బాగానే వంటపట్టింది. పేరుకి అన్నగారు సుల్తానయినా వ్యవహారమంతా నడిపేది అతనే!

గిసుదరాజ్ నివాసానికి వస్తున్నట్లు ముందుగా కబురు పంపలేదు. అలాచేస్తే గిసుదరాజే స్వయంగా రావచ్చు. అన్నగారి సమక్షంలో మాట్లాడడం అంత మంచిది కాదు. అందుకే మూడో కంటికి తెలియనివ్వకుండా ప్రయాణమయ్యాడు. వెళ్ళే సరికి గిసుదరాజ్ మసీదు వద్ద నమాజ్ చేస్తూ ఉన్నాడు. ఎప్పటిలాగే చాలామంది ఆ నమాజులో పాల్గొనడం చూసాడు. అప్పుడే సలావత్ ముగించీ గిసుదరాజ్ సూఫీ మత ప్రవచనాలు చెప్పడానికి ఉపక్రమిస్తున్నాడు. దూరంనుండి అహ్మద్‌ఖాన్ రాకని గమనించాడు. కూర్చోమన్నట్లుగా సైగ చేసి తిరిగి తన ప్రసంగంలో మునిగిపోయాడు. మౌనంగా ఎంతో వినయంతో నమాజ్ గుంపులో చేరాడు అహ్మద్‌ఖాన్. గిసుదరాజ్ గుల్బర్గా రాజ్యానికి పెద్ద దిక్కు. ఈ రాజ్యం అతను పెట్టిన భిక్షేనని అహ్మద్‌ఖాన్‌కి తెలుసు. అందుకనే గిసు దరాజ్ దగ్గర ఏమాత్రం

రాజ్యానికి వకీల్-ఎ-సుల్తానన్న ఊసే రానీయడు. గిసుదరాజ్ అంటే గౌరవమే కాదు; భయం కూడా. ప్రవచనాలు ముగిసే సరికి కాస్త సమయమే పట్టింది. వకీల్‌ఎ-ఎ-సుల్తాన్ఎ వచ్చాడని గిసుదరాజ్ తన విధులు మానలేదు. మానడు కూడా. అందుకే కిమ్మనకుండా ప్రజల పక్కనే కూర్చున్నాడు అహ్మద్‌ఖాన్.

కొంతసేపయ్యాక గిసుదరాజ్ తన ప్రసంగాన్ని ముగించాడు. అందర్నీ ఎవరి ఇళ్ళకు వాళ్ళని వెళ్ళమని ఆదేశించాడు. చీకటి పడడం వల్ల అక్కడ వెలుతురు తగ్గింది. దగ్గర్లో ఒకే దీపం వెలిగించారు. అలా చీకట్లో సంభాషించడం ఎందుకని గిసుదరాజ్ అహ్మద్‌ఖాన్ని మసీదు పక్కనే ఉన్న తన నివాస గృహానికి తీసుకెళ్ళాడు. వచ్చిన విషయం అడిగాడు.

"సలామాలేకుం మౌలియా! ఒక చిన్న సమస్య వచ్చిపడింది. మీరే దీనికొక పరిష్కారం చూపగలరని వచ్చాను..." అహ్మద్‌ఖాన్ వచ్చిన వైనం చెప్పాడు.

సమస్య అనగానే కనుబొమ్మలు ముడేసి, ఏమిటన్నట్లుగా చూసాడు గిసుదరాజ్.

అహ్మద్‌ఖాన్ మెల్లగా హసన్‌ఖాన్ గురించి చెప్పడం మొదలు పెట్టాడు. గిసుదరాజ్‌కి విషయం అర్థమయ్యింది.

"ఫిరోజ్ ఇంతవరకూ ఎలా రానిచ్చాడు? వ్యసన పరుడైన కొడుకుని మందలించాలని కూడా అనిపించలేదా? సుల్తానుకి రాజ్యమూ ప్రజలే కాదు; కుటుంబం కూడా ముఖ్యమే! అందునా కాబోయే వారసుడికి ఇలాగా తర్ఫీదు ఇచ్చేది? ఇన్నాళ్ళు నాకీ సంగతి ఎందుకు చెప్పలేదు?"

గిసుదరాజ్ వారసుడనే సరికి ఒక్కసారి మనస్సులో ఉలిక్కిపడ్డాడు అహ్మాద్‌ఖాన్. పైకి ఏమాత్రం కనబడనీయకుండా అన్నగారి వైపు వకాల్తా పుచ్చుకున్నాడు.

"మీకు తెలియందేముంది? ఒక పక్క రాజ్య పాలన, మరో వైపు విజయ నగరరాజులు ఎప్పుడు దండెత్తి వస్తారో వాళ్ళనుండి ప్రజల్నీ, రాజ్యాన్నీ ఎలా రక్షించాలా అన్న దిగులూ, ఫిరోజ్‌కి స్థిమితం లేకుండా చేస్తున్నాయి. ఇన్నాళ్ళూ అన్నగారికీ తెలియదు. ఇప్పుడే తెలిసింది. అందుకే హసన్‌ఖాన్ని సరైన దారిలో పెట్టేలా మీఒక్కరి వల్లే సాధ్యమని నేను మిమ్మల్ని ఆశ్రయించాను. ఈ సాయంత్రపు మంతనాలన్నీ వాయిదా వేసుకొని తక్షణమే మీ వద్దకు రావడానికిదే కారణం.."

"అర్థమయ్యింది. రేపు హసన్‌ఖాన్ని ఇక్కడికి తీసుకొని రండి. కొంతకాలం నావద్దే ఉండేలా ఏర్పాట్లు చెయ్యమని సుల్తాన్‌కి నా మాటగా చెప్పు. నువ్వు ఇలా వచ్చి చాలా మంచి పని చేసావు. నిన్ను ప్రత్యేకంగా అభినందిస్తున్నాను. నీలాంటి తమ్ముడుండడం ఫిరోజ్ ఎంతో అదృష్టం చేసుకున్నాడు. హసన్ని నా వద్దే కొన్ని మాసాలు ఉంచుకొని సూఫీ మత సాంప్రదాయాల గురించి తర్ఫీదిస్తాను. అతన్ని మామూలు మనిషిగా చేసే పూచీ నాది..."

సరిగ్గా అహ్మాద్‌ఖాన్ ఏం కోరుకున్నాడో అదే గిసుదరాజ్ నోట వచ్చింది. క్షణం కూడా ఆలస్యం చెయ్యకుండా గిసుదరాజ్ ఆజ్ఞని పాటిస్తూ కోటకి బయల్దేరాడు. గిసుదరాజ్ తర్ఫీదు ఓ నాలుగైదు మాసాలు పట్టచ్చు. అంతవరకూ తను నిశ్చింతగా ఉండచ్చు. అప్పటి సంగతి అప్పుడు చూసుకోవచ్చు. ఈలోగా ఫిరోజాబాద్ కోట నిర్మాణమూ పూర్తవుతుంది. ప్రస్తుతానికి ఒక సమస్య తీరింది అహ్మాద్‌ఖాన్‌కి.

వెళుతూనే సరాసరి ఫిరోజ్‌షా మందిరానికే వెళ్ళాడు. గిసుదరాజ్ వద్ద జరిగినదంతా వివరించాడు. గిసుదరాజ్ వద్దకు వెళితే హసన్ మామూలు మనిషవుతాడన్న నమ్మకముంది ఫిరోజ్‌షాకి. అదే సంగతి పైకి అన్నాడు కూడా. మాటలు విని హమ్మయ్య అనుకుంటూ ఊపిరి పీల్చుకున్నాడు అహ్మాద్‌ఖాన్. మర్నాడు ఉదయానికల్లా తనమందిరానికి హసన్ని రమ్మనమని తన సేవకుల్ని పంపాడు.

000000000000

సాధారణంగా ఎప్పుడూ నడి రాత్రి మందిరానికొచ్చే ఫిరోజ్‌షా ఆనాడు మాత్రం పొద్దెక్కగానే వచ్చేసాడు

అతని మనస్సుసకి అస్సలు కుదురు లేకుండా పోయింది. ఎంతసేపూ అతనికి హసన్ గురించే ఆలోచన్లు. ఇన్నాళ్ళూ తను హసన్ని అంతగా పట్టించుకోలేదు. అంతా సవ్యంగానే నడుస్తోందనుకున్నాడు. గుల్బర్గా సామ్రాజ్యానికి కాబోయే సుల్తాన్ వ్యసనపరుడిలా, ఎందుకూ పనికి రాని వ్యక్తిగా తయారవుతున్నాడాన్న విషయం ఓ పట్టాన జీర్ణించుకోలేకపోతున్నాడు.

దర్బారుకెళ్ళాడు కానీ స్థిర చిత్తం లేదు. అందరూ ఏదో చెబుతున్నారు కానీ ఒక్కటీ అతని బుర్రకెక్కలేదు. అందుకే ఉన్న పనులన్నీ వాయిదా వేసి మందిరానికి తిరిగొచ్చేసాడు. వచ్చేముందే అహ్మాద్‌ఖాన్ గిసుదరాజ్‌ని కలిసినట్లుగా చెప్పాడు. ఉదయం నుండీ కలవరం చెందిన మనసొక్కసారి గిసుదరాజ్ హసన్ బాధ్యత తీసుకుంటారని తెలిసాక కాస్త కుదుట పడింది. తనొక్కడే కాదు; భార్య రెహానా, తమ్ముడు అహ్మాద్‌కీ ఇదే చింత. ఇన్నాళ్ళూ తనతో చెప్పడానికి వీళ్ళు జంకి వుంటారు. ఏదయితేనేం? అల్లా దయవల్ల సరైన సమయానికే అందరూ మేల్కొన్నారు. గిసు దరాజ్ వద్ద కొన్నాళ్ళు గడిపితే హసన్ బాగుపడతాడు. నాలుగు ముక్కలయినా అబ్బుతాయనుకున్నాడు ఫిరోజ్‌షా!

అహ్మాద్‌ఖాన్ తెచ్చిన మంచి వార్తని రెహానా చెవిన వెయ్యాలని హుటాహుటిన మందిరానికి ప్రయాణమయ్యాడు. తండ్రిగా తనే ఇంత దిగులు చెందుతూ వుంటే, తల్లిగా రెహానా ఎంత వేదన చెందుంటుందో కదా? సుల్తానా ముందు ఎవరూ పైకి

అనకపోయినా వెనుక హసన్ గురించి చెవులు కొరుక్కునే వుంటారనుకున్నాడు. మహారాజునీ, కుటుంబాన్నీ ప్రజలు వెయ్యి కళ్ళతో గమనిస్తూ ఉంటారన్న విషయం ఫిరోజ్‌షాకి తెలుసు. అందుకే బహిరంగంగా అతను ఎంతో హుందాగా ప్రవర్తిస్తాడు. తద్వారా అందరి మన్ననలూ, గౌరవమూ సంపాదిస్తాడు.

ఎన్నడూ లేనిది నాడు చీకటి పడగానే మందిరానికి వచ్చిన ఫిరోజ్‌షాని చూసి ఆశ్చర్యపోయింది మెహజబీన్. ఉదయం నుండీ సుల్తానా తన పడకగది దాటి బయటకి రాలేదు. హసన్ పుట్టిన రోజుకని వండిన పిండివంటలొక్కటీ ముట్ట లేదు. మధ్యాహ్నం హసన్ నిద్ర లేచాడాని కనుక్కోమని కబురు పంపింది. ఇంకా లేవ లేదన్న జవాబే వచ్చింది. సాయంత్రమయినా వస్తాడేమో అనుకున్న మెహజబీన్‌కి చీకటి పడ్డాక హసన్ ఇహ రాడన్న విషయం అర్థమయ్యింది. సాధారణంగా సుల్తానా రాత్రి భోజనం త్వరగానే చేస్తుంది. అదవ్వగానే తనూ ఇంటికెళుతుంది. ఇవాళ రెహానాని చూసాక వెళ్ళ బుద్ధి కాలేదు. రాత్రికి అక్కడే ఉండిపోదామనుకుంది. ఒక్కోసారి రెహానాతో కబుర్లాడుతూ అక్కడే ఉండిపోతుంది. ముఖ్యంగా ఫిరోజ్‌షా ఏదైనా ఊరు వెళ్ళినప్పుడు. ఉదయం నుండీ సుల్తానా పచ్చి మంచి నీళ్ళు కూడా ముట్టలేదు. తను ఎన్నోసార్లు చెప్పి చూసింది మెహజబీన్. అయినా ఫలితం లేకపోయింది. సుల్తానాకి తలనొప్పిగా ఉందని ఆమె పడకగది పక్కనే ఉన్న గదిలో కూర్చొని ఉంది.

హఠాత్తుగా మహారాజు రావడం చూసి ఉలిక్కి పడింది. ఏమయ్యిందోనని తత్తరపడింది.

"సుల్తానా, ఎక్కడ?" అంటూ వస్తూనే ప్రశ్నించాడు.

సుల్తానా విషయం పూర్తిగా చెప్పింది మెహజబీన్.

"హసన్ విషయంలో ఎంతో దిగుల్లో వుంది సుల్తానా. నాకు ఊహ తెలిసి సుల్తానా ఇంత బాధపడడం నే చూళ్ళేదు. హసన్ ఎప్పుడు మారి మనలో తిరుగుతాడాన్నదే ఆమె వేదన. సుల్తాన్! మీరే ఏదో ఒకటి చెయ్యండి. హసన్ని మనలో ఒకడుగా తిరిగేలా చెయ్యండి..అతను బాగు పడడానికి ఏ త్యాగానికయినా మేం సిద్ధమే!.."

ఆఖరి మాట వచ్చేసరికి తడబడిన గొంతు విని ఫిరోజ్‌షా ఒక్కసారి  మెహజబీన్ కేసి చూసాడు. ఆమె కళ్ళు ఏరువాకలయ్యాయి.

"బాధ పడకు జబీన్! మీ అందర్నీ అర్థం చేసుకోగలను. మౌల్వీ గిసుదరాజ్ హసన్ని తన దగ్గర కొన్నాళ్ళుంచుకోడానికి ఒప్పుకున్నారు. కరడు కట్టిన కసాయి వాణ్ణి కూడా కరింగించ గల శక్తీ, జ్ఞానమూ ఆయనకున్నాయి. ఈ విషయం రెహానా చెవిన వేద్దామనే వచ్చాను..."

ఫిరోజ్‌షా మాటలు ఆమెకు ఉపశమనం కలిగించాయి. ఫిరోజ్‌షా సుల్తానా పడక గది వైపుగా వెళ్ళాడు. మెహజబీన్ అతన్ననుసరించింది. సాధారణంగా తను వారిద్దరి మధ్యకి ఎప్పుడూ రాదు. కానీ సుల్తానా ఎవరొచ్చినా మాట్లాడే స్థితిలో లేదు. అందుకే ఆ గది వైపుగా వెళ్ళింది. ద్వారానికున్న తెరలు తొలగించుకొని లోపలకి ప్రవేశించాడు ఫిరోజ్‌షా.

సుల్తాన్ని చూసి ఒక్కసారి బావురుమంది రెహానా. గిసుదరాజ్ హసన్ని తనవద్దకు పంపమన్న విషయం చెప్పాడు. దిగులు పడనవసరంలేదని సముదాయించాడు. తన తమ్ముడు అహ్మద్ చొరవ వల్లే గిసుదరాజ్ ఒప్పుకున్న విషయమూ చెప్పాడు. ఈ ఘనత అతనికే చెందుతుందని చెప్పాడు. రెహానా ఈ వార్త విని సంతోషించింది. కొంతసేపయ్యాకా మెహజబీన్ ఇంటి ముఖం పట్టింది. అప్పటికే చాలా పొద్దుపోయింది. తనకి సాయంగా కొంతమంది సేవకుల్ని తీసుకెళ్ళింది. ఇంటికెళ్ళేసరికి జబీన్ తల్లి ఎదురుచూస్తూ వుంది.

"ఏమయ్యింది? ఇవాళ ఇంత లస్యమయ్యింది?" గుమ్మంలో అడుగుపెడుతూండగానే అడిగింది తల్లి పర్వీనా.

"ఇవాళ హసన్ పుట్టిన రోజని నిన్న చెప్పాను కదమ్మా..?"

"ఏం ఇంకా అక్కడ గానా బజానా జరుగుతోందా? " తల్లి ఉత్సాహంగా అడిగింది.

జబీన్‌కి జవాబిచ్చే సక్తి లేదు. కళ్ళల్లో దుఃఖం జలప్రవాహమవుతూండగా ఒక్కసారి తన గదిలో మంచమ్మీద వాలిపోయింది. కూతురు పరిస్థితి చూసి కంగారు పడింది పర్వీనా.

"ఏమయ్యిదమ్మా? ఎవరైనా నిన్ను ఏమైనా అన్నారా? చెప్పు. నేను సుల్తాన్‌తో మాట్లాడతాను..." మంచమ్మీద వాలిన కూతుర్ని దగ్గరకు తీసుకుంటూ అంది.

"లేదమ్మా! ఎవరూ ఏమీ అన్లేదు. పుట్టినరోజని హసన్ కోసం ప్రత్యేకంగా ఎన్నో చేసి, ఎదురు చూసిన తల్లి తండ్రులకీ సంతోషం లేదు. హసనే నా సర్వస్వం అనుకున్న నాకూ ఆనందం లేదు. రాత్రీ పగలూ మద్యానికి బానిసై అసలు మనుషుల మధ్యే మసల్లేని స్థితిలో ఉన్నాడు హసన్! ఇదంతా మన దురదృష్టమమ్మా!.."

"ఎందుకింత దుఃఖం తల్లీ? సుల్తాన్ బిడ్డలన్నాక అలాగే ఉంటారు. అయినా ఇదంతా ఫిరోజ్ భాయీ చూసుకోవాలి. తల్లితండ్రులకి పట్టని బిడ్డలు ప్రపంచానికెందుకు పడతారమ్మా?.."

ఫిరోజ్‌షా, రెహానాల బాధనీ పూసగుచ్చినట్లు చెప్పింది మెహజబీన్.

"సంతానం అప్రయోజకుల్లా తయారవుతుంటే ఏ తండ్రి మాత్రం బాధపడకుండా వుంటాడు? మహారాజు కూడా ఒక మనిషే కదా? " అని అంది మెహజబీన్.

"నిజమేననుకో! నువ్వు తాగుబోతుని సర్వస్వం అనుకోడం మనకు తగదమ్మా! నువ్వు కావాలనుకున్నా ఫిరోజ్‌షా ఒప్పుకోడు. ఎందుకొచ్చిన బాధ తల్లీ?"

చిటుక్కున తల్లికేసి చూసింది మెహజబీన్.

"ఇదంతా మన దురదృష్టం. తన్మతన్‌షా గుడ్డివాడుగా అవ్వడం; అతని కొడుకూ తిరుగుబాటులో చనిపోవడం; ఇవన్నీ మన ప్రారబ్ధాలేనమ్మా! అన్నీ సవ్యంగా ఉంటే నేను కాబోయే సుల్తానా అయ్యుండేదాన్ని. ఇదంతా మన ఖర్మ. ఏం చేస్తాం! అమ్మా, ఎలాగయినా నేను సుల్తానా అయి తీరుతాను. అందుకే ఇష్టమున్నా లేకున్నా రెహానా పక్కన చేరాను. ఆమె మెప్పు పొందితే హసన్ని పెళ్ళాడడం సులభమేననుకున్నాను. అందుకే రాత్రనకా పగలనకా అక్కడ పనిచేస్తున్నాను. కానీ ఈ హసనే...ఇలా జడ్డిలా తయారయ్యాడు... ఛీ, ఛీ.."

"ఎందుకొచ్చిన సుల్తానాలమ్మా! అధికారదాహం అయినవాళ్ళ అంతూ చూడగలదు; కానివారిని కావలించుకోనూ గలదు. నీకు తెలియంది కాదు. అధికార వాంఛకి తన్మతన్‌షా ఎలా బలయ్యాడో ప్రత్యక్షంగా చూసావు. మనం కూడా చచ్చి బ్రతికి బయటపడిన వాళ్ళమే! ఇదంతా తెలిసీ నువ్విలా..? . తన్మతన్‌షా గురించి తెలిసీ నువ్వు ఇలా ఆశ పెట్టుకోడం మంచిది కాదమ్మా? మీ నాన్నగారికి విషయం తెలిస్తే నిన్నూ నన్నూ బ్రతకనీయరు! "

తల్లి మాటలు శూలాల్లా గుచ్చుకున్నాయి మెహజబీన్‌కి.

"నా సంగతి నీకు తెలీదమ్మా! ఎలాగయినా హసన్ని పెళ్ళాడి తీరుతాను. ఆరు నూరయినా సరే నేను గుల్బర్గా రాజ్యానికి సుల్తానా అయి తీరుతాను. ఇదే నా ధ్యేయం. దానికోసం ఏదైనా చేస్తాను..రెహానా అనుభవిస్తున్న భోగం నీకు తెలీదమ్మా! ఆ నగలూ, పట్టు వస్త్రాలూ, అడుగడుగునా సేవకులూ, ఒకటేమిటి? అది అనుభవించాలంతే! సుల్తానాని నేను ప్రత్యక్షంగా చూస్తున్నాను. నీకు తెలీదు హోదాలో ఉన్న దర్పమూ, అధికారమూ! నువ్వెన్ని చెప్పు.. నేను సుల్తానా అయి తీరుతాను.." అంటూ విసూరుగా గదిలోంచి బయటకెళిపోయింది మెహజబీన్!

కూతురు మాటలు విని నిశ్చేష్టురాలై చూస్తూ ఉండిపోయింది పర్వీనా.

00000000000000

దేవరాయల ఆదేశం మేరకు ముద్గల్ బయల్దేరాడు వేదరాయశర్మ. మామూలుగానయితే గంగావతి వరకూ గుర్రపు బగ్గీ బాడుగకి కట్టించుకొని వెళ్ళేవాడు. అక్కడనుండి కనకగిరి వెళ్ళేవాడు. రాత్రికక్కడ బస చేసి మర్నాడు తవరగిరి వెళ్ళేవాడు. చివరగా అక్కడనుండి ముద్గల్ చేరుకునేవాడు. వెళ్ళడానికి రెండు రోజులు పట్టేది. వర్షాకాలం అయితే నాలుగయిదు రోజులు పట్టిన సంఘటనలుకూడా వున్నాయి. ఈసారి ముద్గల్ ప్రయాణం ప్రతీసారిలా కాదు. తనతో పాటు పాతికమంది పైగా సైనికులు తోడు వచ్చారు. వీరు కాకుండా మరో ఇద్దరు ఉప దండనాయకులూ ప్రయాణిస్తున్నారు. తనకి ప్రత్యేకమైన గుర్రపు బగ్గీ ఏర్పాటు చేసాడు దేవరాయలు. ముందూ వెనుకా అంగ రక్షకులతో వెళుతున్నాడు. ఈ అనుభవం గతంలో ఎప్పుడూ లేదు. రాచమర్యాదలు తెలుసు కానీ ఇలాంటివి వేదరాయశర్మకి కొత్తే! శంభుడి సంగతి సరే సరి. విజయనగరం వచ్చినప్పటినుండీ తనికన్నీ ఆశ్చర్యాలే! గురువుగారితో పాటు అతనూ రాచ మర్యాదలు పొందుతున్నాడు. వేదరాయశర్మా, శంభుడూ ఒక బగ్గీలో వెళుతున్నారు. వారి వెనుకనే బగ్గీలో నేహలకిచ్చే కానుకలున్నాయి. బంగారు భరణాలూ, రత్న వైఢూర్యాలూ, మణిహారాలూ, పట్టు వస్త్రాలూ ఒకటేమిటి? సమస్తమూ ఆ బగ్గీలో ఉన్నాయి. అయినా రాజు తలుచుకుంటే కనకవర్షమూ కురిపించగలడు; కాదనుకుంటే కొరడాదెబ్బలూ తినిపించగలడని ఈ వైభవం చూసి మనసులో అనుకున్నాడు వేదరాయ శర్మ. దానికి కాపలాగా ముందూ వెనుకా పది మంది సైనికులు గుర్రాలపై వస్తున్నారు.

దారిపొడుగునా తినడానికి తినుబండారాలు వున్నాయి. ఇన్ని సౌకర్యాలూ వున్నా వేదరాయశర్మ మనసు స్థిరంగా లేదు. నేహల చుట్టూనే ఆలోచనలు తిరుగుతున్నాయి. మహారాజు ఆహ్వానాన్ని తిరస్కరిస్తుందేమోనన్న అపనమ్మకం అతని మనసుని దొలిచేస్తోంది.

నేహల చిన్నపిల్ల; ప్రపంచం తెలీదు; జీవితమంటే ఇంకా అనుభవం లేదు. ఆమె ఎలా వున్నా తండ్రి హరీంద్ర విజ్ఞుడే ! కోరివచ్చిన అదృష్టాన్ని వెనక్కి నెట్టేసే మూర్ఖుడు కాదు. ఈ ప్రపంచంలో ఏ తండ్రయినా కోరుకునేది తమ బిడ్డల సుఖమే కదా? కాబట్టి హరీంద్ర తన అభ్యర్థనని కాదనడు. అవసరమయితే నేహలకి నచ్చ చెప్పగలడని అనుకుంటూ ఒకటికి పదిసార్లు తనని తను సర్దిపుచ్చుకుంటున్నాడు వేదరాయశర్మ. మామూలు సందర్భాల్లో ప్రయాణం చేస్తూన్నప్పుడు ఎన్నో విషయాలు చర్చించే వేదరాయశర్మ ఈ సారి మాత్రం మౌనంగా వుండడం చూసి ఆశ్చర్యపోతున్నాడు శంభుడు. తనూ తెగించి పైకి మాట్లాడలేదు. నేహల ఎంత అదృష్టవంతురాలో కదా? అనుకున్నాడు. అందానికి తగ్గ ఐశ్వర్యం ఆమెని వరిస్తోంది. విజయనగర భావి సామ్రాజ్యానికి రాణి కాబోతోంది. నిన్నమొన్నటి వరకూ తమ మధ్య తిరిగిన మామూలు మనిషి! రేపు మహారాణి కాబోతోంది.

ఒక పక్క రేవన్ననీ, నేహల్నీ విడగొట్టానన్న ఆనందం వున్నా, తను చిత్రపటం గీసిచ్చిన విషయం మహారాజు ద్వారా నేహలకి తెలిస్తే ఊరుకోదు. అందులోనూ మహారాణిగా అధికారం కూడా రాబోతోంది. ఏం జరిగినా గురువుగారే తనని రక్షిస్తారన్న నమ్మకంతో ఉన్నాడు. నేహల ఒప్పుకోదన్న అనుమానం గురువుగారికున్నా శంభుడికా ఆలోచనే రాలేదు. గురువుగారి మౌనం అతనికి ఇబ్బందిగా వుంది. దారిపొడుగూనా ఇద్దరిమధ్యా ఒకటే నిశ్శబ్దం. ఇహ సహనం నశించి చివరకి తనే మాటకలిపాడు శంభుడు.

''గురువుగారూ! విజయనగరంలో బయల్దేరినప్పటి నుండి మీరు ఒక్క మాట కూడా మాట్లాడం లేదు. నేనేమయినా పొరపాటు చేసానా?'' వినయంగా అడిగాడు.

లేదన్నట్లు తలూపాడు వేదరాయశర్మ. ఇహ సంభాషణెలా పొడించాలో తెలీలేదు శంభుడికి. కొంతసేపయ్యాక వేదరాయశర్మే నోరు విప్పి మనసులో మాట చెప్పాడు.

''లేదురా! నాకెందుకో నేహల ఈ పెళ్ళికొప్పుకోదనిపిస్తోంది. ఆ అమ్మాయి గురించి నాకు తెలుసు. నేహల కాదంటే మహారాజు దగ్గర నా పరువు కాస్తా పోతుంది. అయినా రాజుని కాదని ఆమె జీవించగలాదాని ఒకపక్క భయం వేస్తోంది..అంతే..''

"మీరేం దిగులు పడకండి గురువర్యా! గుమ్మం ముందుకొచ్చిన ఐశ్వర్యాన్ని ఎవరు కాదంటారు చెప్పండి? నేహల మొండిదే కానీ అమాయకురాలు మాత్రం కాదు. ఆమె కాదన్నా, తల్లితండ్రులు నచ్చ చెబుతారన్న నమ్మకం నాకుంది. వాళ్ళ మాట నేహల కాదనదు. కాకపోతే ఆమెను ప్రలోభ పరచగల వ్యక్తి గురించే...కాస్త ఆలోచించాలి.."

ఆ మాటలకి ఒక్కసారి తలెత్తి చూసాడు వేదరాయశర్మ.

"నేహల్ని ప్రలోభ పరిచే వ్యక్తా... ఆమె స్నేహితురాలు ప్రభా?"

"కాదు గురువర్యా! నేను చెప్పేది రేవన్న గురించి..అతను.." అంటూ ఆగిపోయాడు శంభుడు. ఇదే తనకున్న మహావకాశమని అతనికి తెలుసు. రేవన్నా, నేహల గురించి చెప్పడానికి ఇంతకన్నా మంచి సమయం లేదు.

"అతనా..? ఎవరతను? " ఆశ్చర్యంగా అడిగాడు.

పైకి చెప్పడానికి తటపటాయించాడు శంభుడు. వేదరాయశర్మ చెప్పమని ఆజ్ఞాపిస్తే మెల్లగా చెప్పడం ప్రారంభించాడు.

"రేవన్నకీ, నేహలకీ మధ్య ఏదో నడుస్తోందని మా స్నేహితులందరూ అనుమానిస్తారు గురువుగారూ! ఇద్దరూ తరచు అశ్వత్థనారాయణ స్వామి కోవెల వెనుక కలుస్తూ ఉంటారని అందరూ అనుకోగా విన్నాను..నే చెప్పే వ్యక్తి రేవన్నే! అతనిమీదే నాకు అనుమానం. నేహల మనసుని ఇట్టే మార్చివేయగలడని ఎందుకో భయంగా వుంది.."

వేదరాయశర్మకి శంభుడి మాటలు నమ్మబుద్ధి కాలేదు. రేవన్న అటువంటి వ్యక్తనుకున్నా, నేహల అటువంటి మనస్తత్వమున్న మనిషి కాదు. అతను చొరవ చూపించినా ఆమె ఆ తరహా అమ్మాయి కాదని అనుకున్నాడు.

"రేవన్నతో కాస్త చనువుగా ఉంటే అందరూ అలా అనుకుని వుండచ్చు. ఎంతైనా నేహల అందగత్తె కదా? రేవన్నే ఆమెను కర్షించడానికి చేస్తున్నాడని మీరందరూ అనుకుంటున్నారేమో? నేహల నిప్పు. అలాంటి పిచ్చి పనులు చెయ్యదు. నాకు చిన్నప్పటినుండీ తెలుసు. ఇదంతా పిచ్చి పుకార్లు...నేన్నమ్మను.."

వేదరాయశర్మ అలా అనేసరికి శంభుడు తిరిగి వాదించలేదు. వాదించడం అతని ఉద్దేశ్యం కాదు. రేవన్న నేహలతో చనువుగా ఉంటాడన్న విషయం చెప్పాలనుకున్నాడు. చెప్పాడు. అంతే. గురువుగారు నమ్ముతారా లేదాన్నది కాలమే నిర్ణయిస్తుందని అనుకున్నాడు.

ఒక పక్క భయమూ, మరో పక్క తనకి దక్కని నేహల రేవన్నకీ దక్కడంలేదన్న ఆనందమూ అతని మనసుని ఆ-వరించుకుంది.

ఆ రాత్రికి వారు కనకగిరిలో బస చేద్దామని ఒక ఉప సైనికాధికారి వచ్చి చెప్పాడు. సరేనన్నాడు వేదరాయశర్మ.

ప్రయాణ బడలిక శరీరాన్ని అంటకున్నా వేదరాయశర్మ మనసుని మాత్రం ఆలోచన్లు కుదిపేస్తున్నాయి.

తెల్లారితే ఏమవుతోందన్న ఉత్కంఠ. రాత్రి కంటిమీద కునుకుపట్టలేదు వేదరాయశర్మకి.

తెల్లారితే నేహల మహారాణి? లేదంటే...?

ఆలోచన్లని మించిన పెనుభూతాలుండవీ ప్రపంచంలో! కాలం స్థంభించి, క్షణాలు స్థాణువులయినట్లుగా ఆకాశం కేసి చూస్తూ గడిపాడు వేదరాయశర్మ.

0000000000000000

తెల్లారింది. మర్నాడు - గిసుదరాజ్ వద్దకు హసన్ని తీసుకు రమ్మన్న వర్తమానం అందించడానికి మెహజబీన్ ప్రత్యేకంగా హసన్ మందిరానికెళ్ళింది. అప్పటికింకా అతను నిద్ర లేవలేదు. క్రితం రాత్రి ఆలస్యంగా నిద్రలేచి మరలా తప్పతాగి పడిపోయాడని సేవకులు చెప్పారు. ఆమె వెళ్ళేసరికి అతను మంచి నిద్రలో ఉన్నాడు. అతనిపై నీళ్ళు కుమ్మరించయినా నిద్ర లేపమని సుల్తాన్ ఆజ్ఞ అన్నట్లుగా సేవకులకి చెప్పింది. వాళ్ళు ఆ పని చేయడానికి వెనుకాడారు. ఏం చెయ్యాలో తోచక చివరకు మెహజబీనే సుల్తాన్ ఫిరోజ్‌షాకి కబురంపింది. హుటాహుటిన ఫిరోజ్‌షా, అహ్మద్‌ఖాన్ ఇద్దరూ వచ్చారు. కొడుకు పరిస్థితి చూసి నీరుకారిపోయాడు ఫిరోజ్‌షా. ఇహ ఆలస్యం చేయడం మంచిది కాదని హసన్ నిద్రలో ఉండగానే గుర్రపు బగ్గీ ఎక్కించమని ఆదేశించాడు. సేవకులు నిద్రపోతున్న హసన్ని బగ్గీలో పడుకో పెట్టారు. ఇంత జరుగుతున్నా హసన్ ఉలుకూ పలుకూ లేకుండా మత్తు నిద్రలో ఉన్నాడు. వాహనాన్ని గిసుదరాజ్ మందిరానికి తీసుకెళ్ళమని ఆజ్ఞాపించాడు. అతని వెనుకే అహ్మద్‌ఖాన్, ఫిరోజ్‌షా, మెహజబీన్ వెళ్ళారు.

గిసు దరాజ్ మందిరం దాటి హసన్ రాకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయమని సైనికాధికారులకి చెప్పాడు. హసన్ ఎప్పుడు మేల్కొంటే అప్పుడే విషయం చెప్పచ్చు. గిసుదరాజ్ మందిరంలో ఉంటే హసన్ బాగుపడతాడన్న నమ్మకం అందరికీ వుంది. ముఖ్యంగా మెహజబీన్‌కి. ఆమెకూడా అక్కడే ఉంటానని సుల్తానికి చెప్పింది. హసన్‌కి దగ్గరకావడానికి ఆ ప్రదేశం మించి మరొకటి లేదామెకు.

000000000000000

ఆ నాడు ఉదయం తండ్రికి సాయంగా తనూ పొలానికి వెళ్ళింది నేహల. నారుమళ్ళు వేసే ముందు ఎప్పుడూ వెళుతుంది. ఉదయం నుండీ సాయంత్రం వరకూ అక్కడే ఉంటాడు హరీంద్ర. నేహలే అతనికి కొడుకయినా, కూతురయినా. ఆమె తోడుగా వస్తానంటే కాదనడు. సూర్యోదయం కాకుండానే తండ్రీ కూతుళ్ళిద్దరూ పొలానికి వెళిపోయారు. నేహల్ తల్లి మాత్రం ఇంటి పనుల్లో ఉండిపోయింది. వాళ్ళెల్లిన కొంతసేపటికి వీధి తలుపులెవరో కొడుతున్నట్లని పిస్తే - 'ఇంత పొద్దున్నే ఎవరా?' అనుకుంటూ వెళ్ళింది.

తలుపు తీసి చూస్తే - ఎదురుగా రేవన్న. అతన్ని చూసి శ్చర్యపోయింది. ఒక చేతిలో సంచీ, మరో చేతిలో బుట్టతో నవ్వుతూ పలకరించాడు.

"మా పెరటి వెనకాల తోటలో మొగలి పూలు చాలా పూసాయి. మా అమ్మ నేహలకని మొగలి పూల జడ కుట్టింది. నేహలకి మొగలి వాసనిష్టం. అందుకని.." నేహల్ తల్లి మొహంలో కనిపించిన ఆశ్చర్యానికి మాటలు ముందుకెళ్ళ లేదు. నేహల లోపలుందాన్నట్లుగా చూస్తున్నాడు.

"నేహల వాళ్ళ నాన్నతో కలిసి పొలానికెళ్ళింది. గురుకులం ఎలాగూ లేదుకదా, తండ్రికి సాయంగా ఉంటానని వెళ్ళింది."

"అయితే - ఈ జడ మా అమ్మిచ్చిందని నేహలకి చెప్పండి. నేను పనిమీద లింగసుగుర్ వెళుతున్నాను. సాయంత్రానికొచ్చేస్తాను. నేహలకి..." అంటూ గిపోయాడు రేవన్న.

"అలాగే చెప్తాను. మీ అమ్మగారు ఈ పూల జడ ఏ ఆధారమూ లేకుండా రేకు మీద రేకు పెట్టి బలే కుట్టేరే! ఎంతో బావుంది. నేహల రాగానే ఇస్తాను."

ఆమె వద్ద శలవు పుచ్చుకొని వెనుదిరిగాడు రేవన్న. నేహలా వాళ్ళ పొలాలు ముద్గల్ ఉత్తరానున్నాయి. తను వెళ్ళే దారి కాదు. లేకపోతే తను వెళ్ళే వాడే! రేపెలాగూ కలుస్తాను కదానుకుంటూ వెళ్ళాడు.

ఆ మధ్యాహ్నం ఏదో పనిముట్ల అవసరం పడి ఇంటికొచ్చారు నేహలా, తండ్రీ. రేవన్న వచ్చి వెళ్ళిన సంగతి నేహల తల్లి చెప్పింది. భోజనం చేసాకా కాస్త విశ్రమించి వెళదామని చెప్పడు హరీంద్ర. నేహల స్నానం చేసి వచ్చి, మొగలి పూల జడ తల్లిని అలంకరించమనడిగింది. తన ఇష్టాలు రేవన్నకి బాగా తెలుసు. నిన్న గుళ్ళో కలిసినప్పుడు మాట వరసకి మొగలి పూల జడంటే ఇష్టమని అంది. తనకోసం మర్నాడే తల్లి చేత జడ కుట్టించాడు. రేవన్నని రేపటి వరకూ కలవడం కుదర్దు. రేవన్న ఎప్పుడూ ఇంతే! ఇలాగే చేస్తాడు. ఇప్పుడే ఊరెళ్ళాలా? అని అనుకుంది. మాధ్యాహ్నం కాస్త చల్ల బడ్డాక మొగలి జడని స్నేహితురాలు ప్రభకి చూపించడానికని వెళ్ళింది.

000000000000000

ఉదయాన్నే కనకగిరిలో బయల్దేరి మధ్యాహ్ననికి ముద్గల్ చేరుకున్నాడు వేదరాయశర్మ. రాజ సైనికులకి భోజన ఏర్పాట్లు చెయ్యమని ముందుగానే ఒక సైనికుడి ద్వారా భార్యకు కబురు పంపాడు. ఇంటికి చేరగానే వంటలు అందరికీ సిద్ధం చేసింది వేదరాయశర్మ భార్య. భోజనాలు ముగించి కాస్త విశ్రమించాక హరీంద్ర ఇంటికెళదామని నిశ్చయించుకున్నాడు. ఇదే విషయాన్ని తనతో వచ్చిన వారికీ చెప్పాడు. మహారాజు నేహలకి పంపిన ఆహ్వానం సంగతి భార్యకి చెప్పాడు. నేహల్ అదృష్టానికెంతో పొంగిపోయిందామె. ఇన్నాళ్ళకి నేహలకి మాహాభాగ్యం పట్టిందని మురిసిపోయింది. భర్త చాలా మంచి పని చేసాడని పొగిడింది. ఈ వార్త తెలిసి నేహల తల్లి తండ్రులు ఎగిరి గంతేస్తారని అంది. వేదరాయశర్మ చేసిన ఈ కార్యానికి మహారాజే కాదు, సమస్త విజయనగరమూ హర్షిస్తుందని ఆమె సంతోషపడింది.

వేదరాయ శర్మతో బాటు తనూ నేహలింటికి వస్తానని ప్రాధేయ పడింది. భార్య రావడం వల్ల ఉపయోగం కనిపించింది వేదరాయశర్మకి. ఎందుకంటే ఆమె నేహలకి నచ్చ చెప్పగలదు. మొదట కాస్త మొరాయించినా తరువాత నేహల కాదనదని ఇద్దరూ గట్టిగా నమ్మారు. భార్య సంతోషం చూసాకా అంతవరకూ ఉన్న నైరాశ్యం పోయి కొత్త ఉత్సాహమొచ్చింది వేదరాయశర్మకి.

''ఇవాళ ఎంతో శుభదినం. మన ముద్గల్కి మంచి రోజులొచ్చాయి. ఈ విజయనగర చరిత్రలో ముద్గల్ పేరూ, ఈ వేదరాయశర్మ పేరూ నిలిచి పోతాయి..ఇది తథ్యం! '' సంతోషంతో గట్టిగా అరిచాడు.

తెలిసన్నాడో, తెలియకన్నాడో తెలీదు; ఆ మాటలు మాత్రం చరిత్ర పలికించిన అక్షర సత్యాలు!

000000000000000000

(కొనసాగింపు వచ్చేసంచికలో)

ఈ నవల క్రిందటి భాగాలు ఇంకా చదవలేదా..? లేక మళ్ళీ ఒకసారి చదువుదామనుకుంటున్నారా? వెంటనే కౌముది గ్రంధాలయాన్ని సందర్శించండి..




POST ONLINE COMMENTS

Click here to go to KOUMUDI Library